
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761



శుక్రవారం | 02-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 798 పేజీలు: 4 వెల : రూ.7


## గ్రానైట్ కొండపై..

# మైనింగ్ మాఫియా కన్ను



* నల్లరాయి కొండ స్వాధీనానికి కదులుతున్న పావులు * మైనింగ్ శాంపిల్స్ కోసం మొదలైన ప్రయత్నాలు * నేతల అండతో రెచ్చిపోతున్న మాఫియా * ఇచ్ఛాపురం నేతతో ముఠా సభ్యులు సంప్రదింపులు * ప్రకృతి విధ్వంసానికి పాల్పడితే సహించేది లేదంటున్న గిరిజనులు * అందరి దృష్టి నువాగడపైనే * గిరిజనుల పొట్ట కొట్టే ప్రయత్నాలు విరమించాలంటున్న ప్రజా సంఘాలు

సోంపేట/కంచిలి, అక్టోబర్ 1 (వార్త): కంచిలి మండలంలోని గ్రానైట్ కొండలపై మైనింగ్ మాఫియా కన్ను పడింది. నువాగడ కాలనీలో గల నల్లరాయి కొండపై మైనింగ్ చేసేందుకు కొందరు పావులు కదుపుతున్నారు. మైనింగ్ వ్యాపారులు, రాజకీయ నాయకులను అడ్డం పెట్టుకొని సదరు కొండపై దోచేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఓ ముఖ్య నాయకునితో మైనింగ్ వ్యాపారులు రహస్యంగా సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. మరోవైపు మైనింగ్ పనులు మొదలుపెట్టే ప్రయత్నాలకు కొంతమంది పూనుకోగా నువాగడా కాలనీకి చెందిన గిరిజనులు ప్రతిఘటించారు. దీంతో వారంతా తోకముడిచారు. ప్రకృతి ఒడిలో... రిజర్వ్ ఫారెస్ట్ లో... నువాగడా పంచాయతీలో సర్వేనెంబర్ 47 లో అత్యంత విలువైన నల్లరాయి కొండకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ కొండపై విలువైన గ్రానైట్ ఉన్నట్టు తెలుసుకున్న జిల్లాకు చెందిన మైనింగ్ వ్యాపారులు దశాబ్ద కాలం పైగా దీనిపైన గురిపెట్టి తీవ్ర స్థాయిలో పావులు కదుపుతున్నప్పటికీ గిరిజనులు అడ్డుకోవడంతో అక్కడితో ఆగిపోతున్నారు. ఎలాగైనా ఈ కొండను సొంతం చేసుకోవాలన్న లక్ష్యంతో రాజకీయ పెద్దలను కూడా కలిసి ఇందులో భాగస్వామ్యం చేయడం గమనార్హం. దీంతో యంత్రాంగం కూడా వారికి సహకరిస్తూ అవసరమైన పత్రాలు, తీర్మానాలు మైనింగ్ శాఖకు అందించి వ్యాపారులకు అనుకూలంగా లీజులు మంజూరు చేస్తూ గిరిజనుల పొట్ట కొట్టే ప్రయత్నాలు దర్జాగా సాగుతున్నాయి. విశాలమైన ఈ కొండ చుట్టుపక్కల గిరిజనులకు ఎంతో జీవనాధారంగా నిలుస్తోంది. కొండపై విశాలమైన వృక్షాలతో పాటు రకరకాల అడవి జంతువులకు నిలయంగా ఉంది. పూర్వకాలంగా నివసిస్తున్న గిరిజనులకు ఈ కొండ అంచున ఇచ్చిన బిడిఆర్ పట్టాల ద్వారా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అన్నిటికన్నా ముఖ్యంగా ఈ కొండపై నుంచి వచ్చిన వరద నీటితో సమీపంలోనున్న చెరువులను నింపుతుంది. తద్వారా ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుంది. అటువంటి కొండను గురిపెట్టి విధ్వంసం సృష్టించేందుకు బడా బాబులు చేస్తున్న ప్రయత్నాలను గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చావైనా చస్తాం కానీ మా జీవనాధారమైన నల్లరాయి కొండను వదులుకునే ప్రసక్తి లేదని సిపిఐ నాయకుడు అయినటి లోకనాథం పేర్కొంటున్నారు. పచ్చని ప్రకృతి మధ్య ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఇటువంటి కొండ వనరును ధ్వంసం చేయాలనుకోవడం కొందరు పెద్దలు, అధికారుల అవివేకం అని గిరిజనులు పేర్కొంటున్నారు.



### సిద్ధమైన మైనింగ్ ప్లాన్..

నల్ల రాతి కొండపై గ్రానైట్‌ను వెలికి తీసేందుకు వ్యాపారులు ఇప్పటికే ప్లాన్స్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కూటమిలోని ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరిపి, రహస్య సమావేశాలు నిర్వహించి కొండను ఎలా సొంతం చేసుకోవాలన్న దానిపై పోలీసులతో కూడా చర్చించి ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. త్వరలో ఈ నిర్ణయాన్ని అమలుపరిచే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం. మైనింగ్ చేపట్టిన అనంతరం గ్రానైట్‌ను లీజుదారులు సొంతం చేసుకోగా మిగతా వేస్ట్ మెటీరియల్ అంతా స్థానిక కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకు కూడా నిర్ణయాలు జరిగినట్టు తెలుస్తోంది. ఎవరికి ఏ విధమైన ప్రయోజనాలు చేకూర్చాలని విషయమై ఇప్పటికే పలు వర్గాలు కలిసి చర్చించుకుంటూ వాటాల విషయం నిర్ణయించుకున్నట్టు బహిరంగ చర్చ జరుగుతుంది.

### రూట్ మ్యాప్ పరిశీలించిన పోలీసులు..

త్వరలో ఇక్కడ జరగనున్న మైనింగ్ కార్యకలాపాలు దాన్ని అడ్డుకునేందుకు సిద్ధమవుతున్న గిరిజనుల పరిస్థితులను, కొండ భౌగోళిక స్వభావాన్ని, అలాగే అక్కడి నుంచి జాతీయ రహదారికి రోడ్డు కనెక్టివిటీ మొదలైన అనేక అంశాలపై పోలీసు అధికారులు గురువారం రూట్ మ్యాప్ పరిశీలించినట్టు తెలిసింది. సోంపేట సిఐ మంగరాజు, కంచిలి ఎస్సై పారినాయుడు కలసి నల్లరాయి కొండను పరిశీలించి వచ్చారు.

### కొండ జోలికి వస్తే పోరాటం తప్పదు..

నల్లరాయికొండ జోలికి ఎవరు వచ్చినా అడ్డుకుని తీరుతామని సిపిఐ నాయకుడు సాలిన నారాయణమూర్తి పేర్కొన్నారు. గిరిజనులకు జీవనాధారంతో పాటు పర్యావరణానికి వెన్నుదన్నుగా ఉన్న ఇటువంటి వనరులను విధ్వంసం చేస్తే, చూస్తూ ఊరుకోమని పేర్కొన్నారు. గిరిజన గ్రామాల ప్రజలతో సమావేశాలు ప్రారంభించామని అందరితో ఐక్యవేదిక ఏర్పాటు చేసి మైనింగ్ కార్యకలాపాలను అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు.






జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు

**-రూ.2.80కోట్లతో కొర్రాయి గేటు--సువర్ణపురం-**
**-సరియాపల్లిలకు బి.టి.రోడ్డు**

**-దశాబ్దాల నాటి కల సాకారమయ్యింది**

**-పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష**



**మందస, అక్టోబరు 1(వార్త):** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలో రూ.2.80కోట్లతో నిర్మించిన కొర్రాయి గేటు--సువర్ణపురం--సరియాపల్లి బి.టి.రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. పలాస నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్ళుగా భావిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న శిరీష మందస మండలంలో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును అత్యంత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ2.80 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. మందస మండలం పాత జాతీయరహదారి నుంచి సువర్ణపురం వరకు రూ.175.00లక్షల అంచనా వ్యయంతో, అలాగే సువర్ణపురం నుంచి సరియాపల్లి వరకు రూ.105.00 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజా వినియోగానికి అందుబాటులోకి తెచ్చామన్నారు. మందస మండల ప్రజలు, ముఖ్యంగా రైతాంగం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొర్రాయి గేటు--సువర్ణపురం-సరియాపల్లి బి.టి. రోడ్డు నిర్మాణం పూర్తికావడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో సరియాపల్లి, సువర్ణపురం పరిసర గ్రామ పంచాయతీ ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరపడిందన్నారు. గతంలో సరైన రహదారి లేక వర్షాకాలంలో ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ.. ఈ నూతన రోడ్డు వల్ల స్థానిక రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించవచ్చని, అలాగే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు మరియు అత్యవసర వైద్య సేవలకు వెళ్లే వారికి ప్రయాణం ఎంతో సురక్షితంగా, సులభంగా మారుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాలే ప్రధాన లక్ష్యంగా పలాస నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, మట్టి రోడ్ల స్థానంలో బి.టి.రోడ్ల నిర్మాణం చేపడుతూ నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రహదారి ప్రారంభోత్సవం తదనంతరం, పేదల సేవలో భాగంగా నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సువర్ణపురం గ్రామంలో ఎమ్మెల్యే గౌతు శిరీష స్వయంగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి పారదర్శకంగా అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్ష, కార్యదర్శులు, మండల ముఖ్య నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కూటమి శ్రేణులు, కార్యకర్తలు, వీర మహిళలు మరియు స్థానిక ప్రజలు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించి, రాకపోకల కష్టాలను తీర్చినందుకు గాను సరియాపల్లి, సువర్ణపురం పరిసర గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కౌశలం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి



**సోంపేట, అక్టోబరు 1(వార్త):** కౌశలం కార్యక్రమం ద్వారా సోంపేట మండలంలో నమోదయి ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ కృషి మేరకు ఈనెల 6న తిరుపతి జిల్లా నాయుడుపేటలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సోంపేట మండలం డిప్యూటీ ఎంపీడీవో ఎం. శాంత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానికల్ తదితర బ్రాంచ్ లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఇది గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఏసీఎస్‌లో మిషనరీ ఆపరేటర్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు వారి బయోడేటా, అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

## నాయీబ్రాహ్మణ సోదరుల ఆత్మీయ సమావేశం మరువలేని అనుభూతి

**-మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్**



**పలాస, అక్టోబరు 1 (వార్త):** పలాస-కాశీబుగ్గ పట్టణంలోని నాయీబ్రాహ్మణ సోదరులు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశం తనకు మరువలేని అనుభూతిని మిగిల్చిందని వివిధ కార్మిక, వర్తక సంఘాల గౌరవ అధ్యక్షుడు, సీనియర్ మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. గురువారం రాత్రి కాశీబుగ్గలోని నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సోదరులు చూపిన ప్రేమాభిమానాలు తనకు నూతన ఉత్సాహాన్ని, ఎనలేని మనోబలాన్ని అందించాయని దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. సమాజ హితం, ప్రజల ఉమ్మడి భవిష్యత్తు కోసం ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటూ, వారి ఆశీస్సులతో మరింత ముందుకు సాగుతానని తెలిపారు. రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో తనపై చూపుతున్న ఆదరాభిమానాలు, అండదండలు, ఆశీస్సులు భవిష్యత్తులోనూ కొనసాగాలని దువ్వాడ శ్రీకాంత్ ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, అందరి విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ముందుకు సాగుతానని ఆయన స్పష్టం చేశారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు



**సంతబొమ్మాళి, అక్టోబరు 1(వార్త):** తాళ్లవలస సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురుకు గాయాలయ్యాయి. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం పోతునాయుడుపేట గ్రామానికి చెందిన పరపటి ఆనందరావు అతని భార్య గున్నమ్మతో కలిసి ద్విచక్ర వాహనం మీద టెక్కలి వెళ్తున్నారు. అదే రూట్ లో కోటపాడు గ్రామానికి చెందిన కొయ్యాన్ని చంటి టెక్కలి నుండి స్వగ్రామశీ కోటపాడు వస్తుండగా మార్గమధ్యంలో తాళ్లవలస సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో భార్యాభర్తలు పరపటి ఆనందరావు, గున్నమ్మ తో పాటు కొయ్యన చంటికి గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు చంటి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాళి ఎస్సై వై. సింహాచలం తెలిపారు.

## ఆదివాసీల భూములకు రక్షణ కల్పించండి



**మందస, అక్టోబరు 1(వార్త):** మందస మండలంలో సుదీర్ఘ కాలంగా సాగుచేస్తున్న కొండపోడు భూములను రీసర్వేలో తమ పేర్లు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు డిమాండ్ చేశారు. రీసర్వేలో తప్పులు తడకలు లేకుండా రైతులకు ముందుగా నోటీసులు యివ్వాలని కోరారు. ఎక్కువగా గిరిజనుల భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని తెలిపారు. గిరిజనేతరుల చేతుల్లో ఆదివాసీలు ఎప్పటికీ మోసపోతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ పుస్తకాలు పంపిణీ చేసే ముందు నోటీసులు ఇచ్చిన అనంతరం పర్మినెంట్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులు, రైతు కూలీలు పాత పద్దతే అనుసరించి, ఆఫీస్ ల చుట్టూ తిరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. సంపూర్ణంగా ప్రక్రియ పూర్తయ్యాక భూపాస్ పుస్తకాలు మంజూరు చేయాలన్నారు. మందస మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మద్దిల రామారావు, సవర ఆనంద్, సవర మాదవరావు, శ్రీకాంత్, బాస్కరరావులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన గ్రామదేవత ఉత్సవాలు

**జి.సిగడాం, అక్టోబరు 1(వార్త):** మండలం పెంట గ్రామంలో వెలసియున్న గ్రామదేవత చెవిటిపోలమ్మ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా అది దేవునిగా నీలమ్మ తల్లి సంభరాలును నిర్వహించారు. నీలమ్మతల్లి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీదులల్లో తిరువీది నిర్వహించారు. అమ్మవారిని గ్రామ శివారులోగల వనుం వద్ద దమ్మలవారిలచే దండకం నడుమ భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆరు రోజులు పాటు అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ముర్రాటలు చెల్లించనున్నట్లు నిర్వాహకులు మక్క విజయలక్ష్మి, మక్క నారాయణరావు తెలిపారు.




## రైతు బజార్‌తో చిరు వ్యాపారులకు కొత్త భరోసా

**-ఎమ్మెల్యే గౌతు శిరీషకు కృతజ్ఞతలు తెలిపిన దువ్వాడ శ్రీకాంత్**

**పలాస, అక్టోబరు 1(వార్త):** పలాస-కాశీబుగ్గ పట్టణంలో నూతన రైతు బజార్ ఏర్పాటు చేయడం చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులకు ఎంతో ప్రయోజనకరమని పలాస-కాశీబుగ్గ పట్టణ తోపుడు బండ్ల, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. రైతు బజార్ ఏర్పాటుకు చొరవ చూపిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణాల్లో చిరు వ్యాపారులు, తోపుడు బండ్లపై ఆధారపడి జీవించే కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, వారికి వ్యాపారం చేసుకునేందుకు అనుకూలమైన స్థలం, మౌలిక వసతులు కల్పించడం ఎంతో అవసరమన్నారు. రైతు బజార్ ఏర్పాటు వల్ల ఒకవైపు రైతులకు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం లభిస్తుందని, మరోవైపు ప్రజలకు తాజా కూరగాయలు, ఇతర ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. "చిరు వ్యాపారుల జీవనోపాధికి రైతు బజార్ ఎంతో కీలకం" అని శ్రీకాంత్ అన్నారు. ఇప్పటివరకు రహదారుల పక్కన, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వ్యాపారం చేసుకోవాల్సి రావడంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వ్యాపారులకు క్రమబద్ధమైన స్థలం లభిస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు, వ్యాపార కార్యకలాపాలు కూడా సక్రమంగా సాగుతాయని వివరించారు.

పలాస--కాశీబుగ్గ పట్టణ అభివృద్ధిలో చిరు వ్యాపారుల పాత్ర కూడా ముఖ్యమైనదేనని ఆయన అన్నారు. వ్యాపారులకు వసతులు



కల్పిస్తూనే పట్టణ పరిశుభ్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు సౌకర్యవంతమైన మార్కెట్ వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు బజార్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి, రైతులు--వ్యాపారులు--వినియోగదారులకు సమానంగా ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. "రైతు బజార్ ఏర్పాటుతో చిరు వ్యాపారుల సమస్యను అర్థం చేసుకుని పరిష్కారం దిశగా అడుగు పడింది. భవిష్యత్తులోనూ చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ఇదే విధమైన సహకారం అందించాలని కోరుతున్నాం" అని దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. పలాస--కాశీబుగ్గ పట్టణ తోపుడు బండ్ల, చిరు వ్యాపారుల సంఘం తరఫున ఎమ్మెల్యే గౌతు శిరీషకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

## పొదుపుతో సేవ.. విద్యార్థుల్లో మానవతా విలువలు



**పలాస, అక్టోబరు 1(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా బోధించిన 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే సందేశాన్ని ఆచరణలో పెట్టేలా విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందిస్తున్నామని శ్రీ సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశం అన్నారు. విద్యార్థులు తమ రోజువారీ అవసరాల్లో అనవసరమైన ఖర్చులను తగ్గించుకుని పొదుపు చేసే మొత్తాన్ని సమాజ సేవకు వినియోగించడం అభినందనీయమన్నారు. రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు గత 11 సంవత్సరాలుగా తమ జేబు ఖర్చుల్లో కొంత మొత్తాన్ని పొదుపు చేసుకుంటూ, ప్రతి నెలా ఒకటో తేదీన నారాయణసేవ నిర్వహిస్తున్నారని తెలిపారు. చిన్న వయసులోనే విద్యార్థుల్లో సేవా దృక్పథం, దానగుణం, మానవతా విలువలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా అక్టోబరు ఒకటో తేదీన షిర్డీసాయి మందిరం సమీపంలోని నిరుపేదలకు విద్యార్థులు ఆహార ప్రసాదాన్ని అందించారు.

స్వామివారి విభూతి, స్వామివారి చిత్రపటాలను కూడా అందజేశారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యత, తోటి మనుషుల పట్ల ప్రేమ, సేవాభావం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే విద్యావిహార్ లక్ష్యమన్నారు. విద్యార్థులు తమ సొంత పొదుపు నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా 'అవసరాలను అదుపులో పెట్టుకుని, సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించాలి' అనే సత్యసాయి సందేశాన్ని ఆచరణలో చూపిస్తున్నారని మల్లా రామేశం తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడటంతో పాటు సమాజంలో మానవతా విలువలను బలోపేతం చేస్తాయని అన్నారు.

ఈ సేవా కార్యక్రమంలో నారాయణసేవ ఇన్‌చార్జి దాలేటి సార్‌తో పాటు శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**పలాస, అక్టోబరు 1(వార్త):** పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు పలాస మండలం కిస్టుపురం గ్రామం బూత్ నంబర్ 32లో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన పింఛన్‌దారులకు పింఛన్ మొత్తాలను అందజేస్తూ వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనిట్--9 కన్వీనర్ కృష్ణంరాజు మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా స్థానిక నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం అందుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు తులసిరావు, ఉపాధ్యక్షుడు ఢిల్లీ, గ్రామ వీఆర్వో, స్థానిక నాయకులు, పింఛన్‌దారులు తదితరులు పాల్గొన్నారు.

## డోకులపాడులో పింఛన్లు పంపిణీ చేసిన ఏపీఎం




**మందస/వజ్రపుకొత్తూరు, అక్టోబరు 1(వార్త):** వజ్రపుకొత్తూరు మండలంలోని డోకులపాడు జీపీలో ఏపీఎం గౌడబ ప్రసాదరావు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఎన్.టి.ఆర్ పెన్షన్ భరోసా పథకంతో పెన్షన్ లబ్ధిదారులు కుటుంబాలలో ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ధనుజయ్, వీఓఏ శ్రీదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తల సేవలు అభినందనీయం



**జి.సిగడాం, అక్టోబరు 1(వార్త):** అంగన్వాడీలలో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందించటంతో కార్యకర్తలు సేవలు అభినందనీయమని బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి అన్నారు. సేవా సంకల్ప అభియాన్ లో బాగంగా గురువారం మండల కేంద్రంలో అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలలో లబ్దిదారులకు సక్రమణంగా పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. గ్రామాలలో లభ్యమయ్యే కూరగాయలు, ఆకుకూరలు, పిండి వంటలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. వయస్సుకు తగ్గ బరువు లేని వారికి అదనపు పౌష్టిహారాంతో వారి బరువును పెంచవచ్చున్నారు. కిషోర బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఆనంతరం 11 మంది అంగన్వాడీ కార్యకర్తలను దుశ్సాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎఎంసీ ఉపాధ్యక్షులు బూరాడ వెంకటరమణ, వజ్జపర్తి రఘురాం, మండల టిడిపి అధ్యక్షులు కుమరాపు రవిక మార్, టంకాల మౌళీశ్వరరావు, డబ్బాడ అదినారాయణ, ముద్దాడ త్రినాధరావు, ముద్దాడ గౌరి, ఎంపీడీవో జి.రామకృష్ణారావు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజేత స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు

**మందస, అక్టోబరు 1(వార్త):** మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మందస మండలంలోని హరిపురంలో గల విజేత పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా జిల్లా అంధత్వ నివారణ సంఘం చైర్మన్ కలెక్టర్ ఆదేశాలు మేరకు విజేత హైస్కూల్లో పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 410 మంది విద్యార్థులకు మందస మండల నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు జరిపారు. 35 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి, వారికి కళ్ల అద్దాలుకు సిఫార్సు చేశారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణపై పట్ల విద్యార్థులకు వెంకటరమణ అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులు మొబైల్ కు బానిస కావద్దని, మొబైల్ ఫోన్ వలన కలిగే సమస్యలు తెలిపారు. కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ సార మాధవరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఆశ ఎస్.భారతి, ఉపాధ్యాయులు శ్రీలత, గీత, జీవిత, హెల్త్ సెక్రటరి బి.నిర్మల, హెల్త్ అసిస్టెంట్ ఎస్.రాజు, ఆర్.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# వైకాపా భూ అక్రమాలకు స్వస్తి పలికిన ప్రభుత్వం

**- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**

**- సువర్ణపురంలో రాజముద్రతో పాస్ పుస్తకాల పంపిణీ**



**మందస, అక్టోబరు 1(వార్త):** వైకాపా ప్రభుత్వ భూ అక్రమాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికిందని, రాజముద్రతో కూడిన పుస్తకాలను రైతులకు అందజేసిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గం, మందస మండలం, సువర్ణపురం గ్రామంలో రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష ముఖ్య అతిథిగా హాజరై, అర్హులైన రైతులందరికీ అధికారిక రాజముద్ర కలిగిన నాణ్యమైన పట్టాదారు పాస్ పుస్తకాలను స్వయంగా అందజేశారు. పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో భూ యజమానులకు జరిగిన అన్యాయాలను, అక్రమాలను ఈ సందర్భంగా ఆమె తీవ్రంగా ఎండగట్టారు.

– ఫొటోల రాజకీయం: తరతరాలుగా, వంశపారంపర్యంగా వస్తున్న రైతు భూములను కూడా తమ సొంత ఆస్తిగా ప్రచారం చేసుకుంటూ, గత పాలకులు రైతు పాస్ పుస్తకాలపై తమ సొంత ఫొటోలు ముద్రించుకుని రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని విమర్శించారు.

– రికార్డుల్లో గందరగోళం: పాస్ పుస్తకంలో ఒకరి పేరు ఉంటే... రెవెన్యూ సర్వే రికార్డులు, అడంగల్స్‌లో వేరొకరి పేర్లు దర్శనమిచ్చేలా గతంలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని స్థానిక ప్రజలు, కార్యకర్తలు తమ వద్ద వాపోయారని తెలిపారు.

– గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు, రికార్డుల గందరగోళానికి స్వస్తి పలుకుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాజముద్రతో కూడిన అత్యంత నాణ్యమైన, పారదర్శకమైన పట్టాదారు పాస్ పుస్తకాలను రూపొందించి ఉచితంగా అందజేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇకపై ఏ రైతు భూమికీ ముప్పు రాకుండా, చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందిస్తోందని ఎమ్మెల్యే శిరీష తెలిపారు.

– మౌలిక వసతుల కల్పన: గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు బీటీ (డీ) రోడ్లు, గ్రామీణ వీధుల్లో సీసీ (జజ) రోడ్ల నిర్మాణం సహా అన్ని రకాల అభివృద్ధి పనులను ప్రభుత్వం శరవేగంగా చేపడుతోందన్నారు.

– పింఛన్ల పెంపుతో చేయూత: పింఛన్ల వ్యవస్థను ప్రారంభించిందే మన ప్రభుత్వం... ఆ పింఛను మొత్తాన్ని గణనీయంగా పెంచి, పేదలకు ఆర్థిక భరోసా కల్పించింది కూడా మన కూటమి ప్రభుత్వమే" అని ఆమె ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మందస మండల అధ్యక కార్యదర్శులు, మండల ముఖ్య నాయకులు, స్థానిక కూటమి కార్యకర్తలు, సువర్ణపురం గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా రాజముద్ర పాస్ పుస్తకాలు అందుకోవడం పట్ల స్థానిక రైతాంగం తీవ్ర ఆనందం వ్యక్తం చేసింది.

## రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో తేజస్విని ప్రతిభ



**పలాస, అక్టోబరు 1(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో శ్రీకాకుళం జిల్లా నుంచి హాజరైన కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి. తేజస్విని ప్రతిభ కనబరిచింది. విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో బుధవారం నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. 'శక్తి వనరులు' అనే అంశంపై తేజస్విని ప్రసంగించి, శక్తి వనరుల ప్రాధాన్యం, వాటి వినియోగం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా శక్తి వనరులను సంరక్షించాల్సిన ఆవశ్యకతను వివరించింది. శక్తి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ శక్తి వనరుల అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావిస్తూ తన ప్రసంగాన్ని కొనసాగించింది. జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో ప్రథమ స్థానం సాధించిన తేజస్విని రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీకాకుళం జిల్లా తరఫున ఎంపికైంది. రాష్ట్రస్థాయిలోనూ సమర్థవంతంగా ప్రసంగించి తన ప్రతిభను చాటుకుంది. ఆమెకు మార్గదర్శక ఉపాధ్యాయుడిగా కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కిల్లి వెంకటరావు వ్యవహరించారు. రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన తేజస్వినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికలపై తమ ప్రతిభను చాటుకోవాలని వారు ఆకాంక్షించారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



**మందస, అక్టోబరు 1(వార్త):** పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కూటమి నాయకులు అన్నారు. మందస మండలంలోని సొండిపూడి పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ ను రూ.4000లకు పెంచి, ప్రతీ నెల 1వ తేదీనే లబ్ధిదారులకు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా బుధవారం మందస మండలంలోని సొండిపూడి గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే శిరీష ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను అందజేశారని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా ఎమ్మెల్యే శిరీష ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నిత్యం నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే శిరీష సొండిపూడి గ్రామ ప్రజలు, పెన్షన్ లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొండిపూడి పంచాయతీ అధ్యక్షుడు మిస్క గణపతి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు, పార్టీ పంచాయతీ మాజీ అధ్యక్షుడు అల్లుమల్ల నారాయణరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ




**పాతపట్నం, అక్టోబరు 1(వార్త):** శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు పాతపట్నం బార్ అసోసియేషన్ న్యాయవాదులు రెండు రోజుల పాటు (సెప్టెంబర్ 30, అక్టోబర్ 1) కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదులు మరణించిన సందర్భంలో ఇచ్చే సంతాప సమయాన్ని (రిఫరెన్స్ ప్రొసీడింగ్స్) సాయంత్రం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటలకు మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. దివంగత న్యాయవాదులకు తగిన గౌరవం అందించేలా ఈ సంతాప సమయాన్ని భోజన విరామానికి ముందే నిర్వహించాలని న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో పాతపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు న్యాయవాదులందరూ పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## మధ్యవర్తిత్వంతో వివాదాలకు పరిష్కారం



**పలాస, అక్టోబరు 1(వార్త):** జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, పలాస సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ సూచనలతో పలాస మున్సిపాలిటీలోని రాజాం కాలనీ (పాయకరాంపురం) గ్రామంలో గురువారం మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన న్యాయవాది, మధ్యవర్తి జి.ఎం.ఎస్. అనిల్‌రాజు గ్రామస్థులకు మధ్యవర్తిత్వ విధానం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వివాదాలు తలెత్తినప్పుడు ప్రతి అంశాన్ని న్యాయస్థానాల వరకు తీసుకెళ్లకుండా, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశాన్ని మధ్యవర్తిత్వం కల్పిస్తుందని వివరించారు. మధ్యవర్తిత్వ ప్రక్రియ ద్వారా ఇరుపక్షాల మధ్య సయోధ్యకు అవకాశం కల్పించడంతో పాటు సమయం, వ్యయాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. కుటుంబ, ఆస్తి, ఆర్థిక తదితర వివాదాల్లో చట్టబద్ధమైన పరిష్కార మార్గంగా మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు మధ్యవర్తిత్వంపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేసి, ప్రజలు ఈ విధానం గురించి అవగాహన పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆర్నాబ్ తుఫాన్ బాధిత కుటుంబాలకి ప్రభుత్వసాయం



**పాతపట్నం, అక్టోబరు 1(వార్త):** అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా పాతపట్నం మండలం బడ్డుమర్రి పంచాయతీ పరిధిలోని కొండ భీమునిపేట గ్రామంలో ఇల్లు కూలిపోయి నష్టపోయిన బాధిత కుటుంబాలకి ప్రభుత్వం మంజూరు చేసిన సహాయాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం అందజేశారు. బాధిత కుటుంబాలకి కూటమి ప్రభుత్వం నిత్యావసర సరుకులుతో పాటు 3 వేల రూపాయల నగదు సహాయాన్ని అందించి వారికి భరోసా కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అందించే సహాయాన్ని సకాలంలో చేరవేస్తూ, ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



**ఇచ్ఛాపురం, అక్టోబరు 1 (వార్త):** బీజేపీ ఆధ్వర్యంలో బిర్లంగి తొటూరు ప్రభుత్వ బాలల పాఠశాలలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అడ్వకేట్ గుడిసా తరుణరాజ్, బీజేపీ ఉపాధ్యక్షురాలు మంగి లక్ష్మి ఆధ్వర్యంలో జరిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూలరి శశి పాల్గొన్నారు.

## 'జిల్లేడు ద్రావణం'తో పురుగుల నివారణ

**పాతపట్నం, అక్టోబరు 1(వార్త):** మండలంలోని బూరగాం గ్రామంలో రైతులు జామి రాంబాబు, పోలాకి గణపతిలకు చెందిన పొలాల్లో ప్రకృతి వ్యవసాయంలో పురుగుల నివారణకు ఉపయోగించే 'జిల్లేడు ద్రావణం' తయారీ విధానం, దాని ప్రయోజనాలపై మండల వ్యవసాయ అధికారి కె సింహాచలం మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు ప్రయోగపూర్వకంగా గురువారం అవగాహన కల్పించారు. ద్రావణం తయారీ విధానాన్ని, వాడే పద్ధతిని రైతులకు వివరించారు. జిల్లేడులోని చేదు, ఔషధ గుణాలు రసం పీల్చే పురుగులు (పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ, తామర పురుగులు), లార్వాలు (దాసరి, నామాల, పొగాకు లద్దెపురుగు, పచ్చ పురుగు), వరిలో కాండం తొలిచే పురుగు మరియు నేలలోని చెదపురుగులను సమర్థవంతంగా నివారిస్తాయని, దీనిని వరి, మిరప, పత్తి, కూరగాయలు, ఆకుకూరలు మరియు పండ్ల తోటలలో వాడవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్ఎమ్‌టీ ఇందులత, ఉత్తర కుమార్, నాగమణి, దుర్గా, మీనాకుమారి, ప్రేమకుమారి, నీలవేణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## అయుష్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**జి.సిగడాం, అక్టోబరు 1(వార్త):** అయుష్ మందిర్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షులు పైల విష్ణుమూర్తి,మండల టిపిపి అధ్యక్షులు కుమరాపు రవికుమార్ పేర్కొన్నారు. గురువారం జి.సిగడాంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చి అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానం ద్వారా సులువైన చికిత్స అందించడం లక్ష్యంగా ఈ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయుష్ మందిర్ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ఆరోగ్య తనిఖీ, రక్తపోటు, మధుమేహం మోకాళ్ల నొప్పులు, ఇతర జబ్బులతో బాధపడుతున్న వారికి చికిత్స పూర్తిగా ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ, నాయకులు వజ్జపర్తి రఘురాం, డబ్బాడ అదినారాయణ, పొగిరి అప్పలనాయుడు, టంకాల మౌళీశ్వరావు, తదితరులు ఉన్నారు.

## బాధితులకు సీఎం సహాయనిధి



**కంచిలి, అక్టోబరు 1(వార్త):** కంచిలి మండలంలోని పలువురు అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన చేతులు మీదుగా అందజేశారు. పార్టీ నేతలు మాదిన రామారావు, జనసేన ఇన్చార్జ్ దాసరి రాజు తదితరుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కంచిలికి చెందిన సాహుకారి చరణ్ కు 53, 333 రూపాయలు, కొల్లూరు కు చెందిన రంగాల లక్ష్మికి 1,08,600 రూపాయలు, పెద్ద శ్రీరాంపురంకు చెందిన మాదిన అజిత్ కు 33,114 రూపాయలు, శాసనం కు చెందిన గోకర్ల ఆయుష్ కు 64,398 రూపాయలు, కంచిలికి చెందిన కొత్తకోట వెంకటరమణకు 42,880 రూపాయలు, మండపల్లి కి చెందిన డిక్కల సుధారాణికి 20,000 రూపాయలు, జాడపూడి కి చెందిన పిలక సీతయ్యకు 40,000 రూపాయలు చెక్కుల రూపంలో అందజేశారు.

## ఉత్సాహంగా కంచిలిలో ఫ్రెషర్స్ డే వేడుకలు



**కంచిలి, అక్టోబరు 1(వార్త):** కంచిలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్ బాబు, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్యశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేదికపై అతిథుల ఉపన్యాసాలు అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన వాటితో ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపాల్ తో పాటు అతిథులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మంచి సంస్కారం, చక్కనైన చదువు, ఉన్నతమైన క్రమశిక్షణ, తల్లిదండ్రులు అధ్యాపకులు పట్ల గౌరవం విద్యార్థి ఉన్నతికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మంచి చదువులు సాగించి ఉత్తమ ఫలితాలతో చక్కనైన భవిష్యత్తును రూపుదిద్దుకోవాలని కోరారు. కార్యక్రమంలో సివిక్స్ అధ్యాపకుడు పూజారి ధర్మారావు అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులకు 5000 రూపాయల నగదు అవార్డును ప్రకటించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోషమ్మ, దాస్,వాసుదేవరావు, భువనేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను మభ్యపెట్టే చంద్రబాబు కుట్ర

**ఇచ్ఛాపురం, అక్టోబరు 1 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్నామని, బిసి లకు 34% రిజర్వేషన్స్ తో ఎన్నికలు నిర్వహిస్తామని గ్రామీణ స్థానిక సంస్థల కోసం జీవో 105, పట్టణ స్థానిక సంస్థల కోసం జీవో 1065 లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిందని, ఇందిరాసాహెని వా యూనియన్ అఫ్ ఇండియా కేసులో 1992 లో సుప్రీం కోర్ట్ 9 సభ్యుల ధర్మాసనం రిజర్వేషన్లు 50% మించి ఉండరాదనే తీర్పు అమలులో ఉండగా, 2020 లో వైస్సార్సీపీ ప్రభుత్వం బిసి లకు ఇచ్చిన 34% రిజర్వేషన్స్ ఉత్తర్వులు ఏపీ హైకోర్టు కొట్టివేసిన అనుభవంలో ఉండగా, కూటమి ప్రభుత్వం బిసి లకు 34% రిజర్వేషన్స్ ఇస్తానని జీవో లివ్వడం బిసి లను



మభ్యపెట్టడానికి కాదా? అని ప్రశ్నిస్తున్నామని వైస్సార్సీపీ రాష్ట్ర బీసీ కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ అన్నారు. ఒకవేళ ఈ కూటమి ప్రభుత్వానికి బిసి ల పట్ల చిత్తశుద్ధి ఉంటే కేంద్రం ఈ డబ్ల్యూ ఎస్ లకు 10% రిజర్వేషన్స్ పెంచి ఇచ్చిన విధంగా, తమిళనాడు రాష్ట్రం బిసి లకు కేటాయించిన విదంగా 50%రిజర్వేషన్స్ కోసం కేంద్రంలో తమ కూటమి లోని ఎన్.డి.ఏ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి రాజ్యాంగం 9 షెడ్యూలు లో చేర్చి,బిసి ల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.2020 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 34% రిజర్వేషన్ జీవో లను కొట్టివేసిన నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డిగారు 34% బిసి రిజర్వేషన్స్ అధికారికంగా అనుమతించకపోయినా పార్టీ పరంగా బిసి లకు జనరల్ సీట్లలో పోటీకి పెడతామని ప్రకటించి 40% శాతం వరకు స్థానిక సంస్థలలో బిసి లను కూర్చోబెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని అన్నారు. చంద్రబాబు నాయుడు కి, తెలుగుదేశం పార్టీ కి, కూటమి ప్రభుత్వానికి బిసి ల పట్ల చేవ గలిగిన చిత్తశుద్ధి ఉంటే జగన్మోహన్ రెడ్డి మాదిరిగా ప్రతి జిల్లాలో 36% శాతం తగ్గకుండా బిసి లకు సీట్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వినియోగదారుల నమ్మకమే లక్ష్యం

## - కేవీ గోపాల్ అండ్ సన్స్ భారత్ పెట్రోల్ బంక్ ప్రథమ వార్షికోత్సవం

## - పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై లక్కీడిప్ కూపన్లు

**పలాస, అక్టోబరు 1 (వార్త):** వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని కాశీబుగ్గ పదనాపురంలోని కేవీ గోపాల్ అండ్ సన్స్ భారత్ పెట్రోల్ బంక్ యజమానులు కె.వి. గోపాల్‌కృష్ణ, కె.వి. వినయ్ తెలిపారు. బంక్ ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా విజయదశమి, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని అక్టోబరు 1 నుంచి నవంబరు 7వ తేదీ వరకు ప్రత్యేక లక్కీడిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఏడాది కాలంగా పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో తమ బంక్‌ను ఆదరిస్తున్న వినియోగదారులకు కృతజ్ఞతగా లక్కీడిప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో నాణ్యత, కొలతల్లో పారదర్శకత, మెరుగైన సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వ్యాపార అభివృద్ధికి వినియోగదారుల విశ్వాసమే ప్రధాన పునాది అని, ఆ నమ్మకాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.



### కొనుగోళ్లపై కూపన్లు

లక్కీడిప్‌లో భాగంగా పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసే వినియోగదారులకు కొనుగోలు మొత్తాన్ని బట్టి కూపన్లు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెట్రోల్ కొనుగోలుపై ప్రతి రూ.300కు ఒక కూపన్, ఆటో వాహనాలకు రూ.500 విలువైన డీజిల్ కొనుగోలుపై ఒక కూపన్, కార్లకు రూ.1,000 విలువైన పెట్రోల్ లేదా డీజిల్ కొనుగోలుపై ఒక కూపన్ అందించనున్నట్లు వివరించారు. నగదు చెల్లించి ఇంధనం కొనుగోలు చేసే వినియోగదారులకు ఈ కూపన్ సదుపాయం ఉంటుందని తెలిపారు.

లక్కీడిప్‌లో విజేతలకు టీవీ, వాషింగ్ మెషిన్, మైక్రోవేవ్ ఓవెన్, గ్రైండర్ తదితర ఆకర్షణీయమైన బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. విజేతల ఎంపికను వినియోగదారుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు కె.వి. వినయ్ తెలిపారు. ఇండియన్ ఆయిల్ నుంచి మార్పు చేసుకునే వారికి ఒక ఎస్-ఎల్ మగ్గ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో వినియోగదారుల ఆదరణ నిరంతరం కొనసాగుతోందని, కాశీబుగ్గతో పాటు పరిసర ప్రాంతాల వాహనదారులు, వ్యాపార, రవాణా రంగాలకు చెందిన వారు తమ బంక్‌ను ఆదరిస్తున్నారని యజమానులు తెలిపారు. భవిష్యత్తులోనూ నాణ్యమైన ఇంధనాన్ని, మెరుగైన సేవలను అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు కె.వి. రామకృష్ణ, కె.వి. శివకృష్ణ, నవభారత్ యజమాని సురేష్, కె.వి. గోపాల్ సతీమణి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

**పలాస, అక్టోబరు 1(వార్త):** శ్రీకాకుళం జిల్లా టెన్నికాయిట్ జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసేందుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లా సంతోష్‌కుమార్, సుడియా వెంకట జోగారావు తెలిపారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నవంబరు 4వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు సీనియర్ పురుషులు, మహిళల విభాగాల్లో జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 11 నుంచి 13వ తేదీ వరకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 50వ అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరపున పాల్గొంటారని పోటీల నిర్వహణ కార్యదర్శి పి. తవిటయ్య తెలిపారు. జిల్లా నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంపిక పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## సేవా సంకల్ప అభియాన్ వక్తృత్వ పోటీల్లో పాతపట్నం మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

### - జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం..

### - రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**పాతపట్నం, అక్టోబరు 1 (వార్త):** శ్రీకాకుళంలోని గాయత్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి 'సేవా సంకల్ప అభియాన్' వక్తృత్వ పోటీలలో పాతపట్నం పిఎం శ్రీ ఆదర్శ మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని బల్లెడ లక్ష్మీ సహస్ర ద్వితీయ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. వికసిత భారత్‌ఏ2047 అనే అంశంపై లక్ష్మీ సహస్ర అనర్గళంగా ప్రసంగించి న్యాయ నిర్ణేతలను, ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విజేతకు జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్, ఉప విద్యాశాఖాధికారులు విలియమ్స్, విజయకుమారి మరియు జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ చాటి పాఠశాలకు, ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన విద్యార్థిని లక్ష్మీ సహస్రను పాఠశాల ప్రిన్సిపాల్ కె వి రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**ఇచ్ఛాపురం, అక్టోబరు 1(వార్త):** ముచ్చింద్ర మాజీ సర్పంచ్ సాడి జగ్గయ్య రెడ్డి సతీమణి అనారోగ్యం తో మృతి చెందారు.ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి చెందిన దివంగత లాభాల ధర్మసాహు కుటుంబ సభ్యురాలు నటరాజ్ బస్ యజమాని రాలు లాభాల సమంతకమణి ఆకస్మిక మరణం పొందారు. రెండు కుటుంబ సభ్యులను వైస్సార్సీపీ నాయకులు నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమం లో నీలాపు సారథి పాల్గొన్నారు.

## సరస్వతీ పూజకు శుభరాట



**సోంపేట, అక్టోబరు 1(వార్త):** జింకిభద్ర గ్రామం కాపు వీధిలో గురువారం సరస్వతీ పూజలకు శుభరాట వేశారు. అర్చకుల సమక్షంలో గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి సుభరాటను ప్రతిష్ఠించారు. అక్టోబర్ 11 నుంచి సరస్వతీ పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తామాడ చంద్రశేఖర్, తామడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు బియ్యం పంపిణీ

**సంతబొమ్మాళి, అక్టోబరు1 (వార్త ):** తుపాను ప్రభావంతో సముద్రంలో చేపల వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న 50 కిలోల బియ్యాన్ని గురువారం సీతానగరంలో పంపిణీ చేశారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు నౌపడ పంచాయతీ సీతానగరంలో 380 మత్స్యకార కుటుంబాలకు మాజీ సర్పంచి కర్రి విష్ణుమూర్తి సమక్షంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు వాడరేవు కృష్ణారావు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు



## పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ 3.0



**పాతపట్నం, అక్టోబరు 1(వార్త):** పాతపట్నం మండలం గంగువాడ పంచాయతీలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా సుమారు 2కోట్ల రూపాయలతో జరిగిన పలు అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు, గ్రామీణ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. పల్లెల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే గంగువాడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను ఎమ్మెల్యే గోవిందరావు అందజేశారు.

## బీసీ హాస్టల్ ను పరిశీలించి న వైస్సార్సీపీ నాయకులు



**ఇచ్ఛాపురం, అక్టోబరు 1 (వార్త):** ప్రభుత్వ బిసి హాస్టల్ ను వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పరిశీలించారు.హాస్టల్ లో 45 మంది విద్యార్థులు ఉన్నారని , వాచ్ మాన్ లేరని,ఒక కుక్ ఒక క్లీనింగ్ వర్కర్ మాత్రమే ఉన్నారని అన్నారు.అర్ వో వాటర్ సిస్టమ్ పనిచేయడం లేదని 3 నెలల క్రితం పరిశీలన చేసి వాటర్ సిస్టమ్ లేదని జిల్లా కలెక్టర్ కి తెలియజేయడం తో కొత్త అర్ వో సిస్టమ్ పంపడం జరిగిందని అన్నారు.కొత్త ఫిల్టర్ సిస్టమ్ ఇన్స్టలేషన్ సరిగా జరుగలేదని, ఎలక్ట్రికల్ కేబుల్స్ కటౌట్స్ ఏర్పాటు సేఫ్టీ ఆరెంజ్మెంట్స్ సరిగా లేవని .రూఫ్ స్లాబ్ పెచ్చులు ఉడిపోతుందని , విద్యార్థుల మంచాలు ఎత్తు ఎక్కువగా ఉండటం వలన సిలింగ్ ఫ్యాన్ లు విద్యార్థులకు తాకె అవకాశం ప్రమాదాలకు ఆస్కారం కలదని,విద్యార్థులకు మెనూ ప్రకారం ఇవ్వాల్సిన పాలు, పండ్లు, స్నాక్స్ ఇవ్వడం లేదని అన్నారు.ఈ కార్యక్రమం లో ప్రదీప్, గాంధీ పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి




**సారవకోట, అక్టోబరు 1(వార్త):** ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సారవకోట ఎస్ఐ అనీల్ కుమార్ సూచించారు. గురువారం సారవకోట మండలం అర్లి టోల్‌గేట్ సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగం, రహదారి భద్రతపై ఎస్ఐ అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా తలకు గాయాలు కాకుండా రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రయాణ సమయంలో వేగ నియంత్రణతో పాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## విద్యార్థుల ప్రతిభకు నిలువుటద్దం 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్'



**పలాస, అక్టోబరు 1 (వార్త):** విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించేందుకు నిర్వహించిన 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్' (ఎస్ఎల్‌సీ) పలాస నారాయణ ఇ-టెక్నో పాఠశాలలో గురువారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. పాఠశాలలోని ఒకటో తరగతి విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలు, ప్రాజెక్టులు, విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు, భాషా నైపుణ్యాలను ఉపాధ్యాయుల సహాయం లేకుండా తమ తల్లిదండ్రులకు స్వయంగా ఆంగ్లంలో వివరించారు. చిన్నారులు చూపిన ధైర్యం, స్పష్టమైన భావవ్యక్తీకరణ తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. అశోక్‌కుమార్ మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో వేదిక భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడమే ఎస్ఎల్‌సీ ప్రధాన ఉద్దేశమన్నారు. నారాయణ విద్యాసంస్థలు పుస్తక పరిజ్ఞానంతో పాటు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమిస్తున్నాయని తెలిపారు. నారాయణ పాఠశాలల శ్రీకాకుళం జిల్లా ఆర్ఐ రాంబాబు మాట్లాడుతూ నేర్చుకున్న విషయాలను ఇతరులకు అర్థమయ్యేలా స్వయంగా వివరించడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా పరిధి విస్తరించడంతో పాటు నాయకత్వ లక్షణాలు, స్వతంత్ర నిర్ణయ సామర్థ్యం పెంపొందుతాయని తెలిపారు. నారాయణ సంస్థ ఏజీఎం శివరామ్ మాట్లాడుతూ విద్యార్థి కేంద్రిత విద్యాబోధనకు నారాయణ విద్యాసంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ పిల్లల ప్రతిభను చూసిన తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయురాలు సంగీత, ఇ-ఛాంప్స్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ల

## అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట

**పోలాకి, సెప్టెంబరు 30 (వార్త):** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు అవసరమైన యూనిఫారాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొత్తం 40 మంది అంగన్వాడీ సిబ్బందికి కొత్త యూనిఫారాలు అందజేశారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు పాఠ్యపుస్తకాలను అందించారు. చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి సేవలను అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం, పోషణతో పాటు బాలల ప్రాథమిక విద్యపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్వాడీ వ్యవస్థ సమాజ ఆరోగ్య సంరక్షణలో కీలకమైన భాగమని పేర్కొన్నారు.



## కొర్లాంలో పోషణ మహోత్సవాలు

**సోంపేట, అక్టోబరు 1(వార్త):** పోషణ మహోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోంపేట మండలం కొర్లం పంచాయితీలో పలు గ్రామాల్లో గురువారం కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి అతిథులుగా హాజరై బాలింతలు గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. వారికి సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచి ఆహారం మంచి ఆరోగ్యం చాలా ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546